క్లుప్తంగా

పోలింగ్ బూత్‌ల పరిశీలన



రేమాలవారిపాలెం(నాగాయలంక): జిల్లా కలెక్టర్ ఆదేశాల నేపథ్యంలో ప్రత్యేక సంక్షిప్త సవరణ– 2025 ఓటర్ల నమోదులో భాగంగా మండలంలోని రేమాలవారిపాలెం, నాగాయలంక గ్రామాల్లో మండల తహసీల్దార్ ఎం.హరనాథ్ ఆదివారం పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. వీఆర్వోలు, బీఎల్ఓలకు ఆయన పలు సూచనలు చేశారు. ఆయన పర్యటన సమయంలో ఓటర్ల నుంచి అందిన నాలుగు దరఖాస్తులను తహసీల్దార్ స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధారణంగా ప్రతి ఏటా నవంబరు, డిసెంబరు మాసాలలో సంక్షిప్త సవరణ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. డీటీ అబ్దుల్ రఫీ వీఆర్వోలు, బీఎల్ఓలు ఆయన వెంట ఉన్నారు.

హైందవ శంఖారావం సభను జయప్రదం చేద్దాం



పెడన: హైందవ శంఖారావం సభకు ప్రతి హిందువూ తరలిరావాలని హిందూ సంఘాల ఐక్యవేదిక ఆదివారం పిలుపు ఇచ్చింది. స్థానిక పడమటి వీధిలోని విఘ్నేశ్వర ప్రార్థన మందిరంలో హిందూ బంధువుల ఐక్యవేదిక సమావేశం నిర్వహించారు. 2025 జనవరి 5వ తేదీన విజయవాడలో విశ్వహిందూ పరిషత్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో హైందవ శంఖారావం సభ నిర్వహిస్తున్నారని ఐక్యవేదిక పేర్కొంది. ఈ సభను విజయవంతం చేయడానికి హిందూవులంతా తరలిరావాలని కోరుతూ కరపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ, రాష్ట్రీయ స్వయం సేవక్, విశ్వహిందూ పరిషత్ భజరంగ్ దళ్, హిందూ బంధు ఐక్యవేదిక సభ్యులు శంకర్, రాము, కోటి, రమణ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ నడకలో చల్లపల్లి వాసులు



చిలకలపూడి (మచిలీపట్నం): స్వచ్ఛ సుందర చల్లపల్లి కార్యక్రమం చేపట్టి ఆదివారం నాటికి పదేళ్లు పూర్తయిన సందర్భంగా చల్లపల్లి వాసులు స్వచ్ఛ నడక కార్యక్రమం నిర్వహించారు. ఉదయం చల్లపల్లి నుంచి మచిలీపట్నం వరకు స్వచ్ఛ నడక కార్యక్రమాన్ని నిర్వహించి, మచిలీపట్నం సమీపంలో ఎస్ఎన్ గొల్లపాలెం జాతీయ రహదారి వద్ద 60 మొక్కలు నాటారు. అనంతరం మచిలీపట్నం కోనేరు సెంటర్‌కు చేరుకున్నారు. స్వచ్ఛ సుందర చల్లపల్లి ప్రతినిధులు డాక్టర్ డీఆర్‌కే ప్రసాద్, టీ పద్మావతి, నాదెళ్ల సురేష్, సర్పంచ్ పైడిపాముల కృష్ణ కుమార్, తూము వెంకటేశ్వరరావు, ఎస్.లీలాబ్రహ్మేంద్ర, గోపాలకృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పవిత్రోత్సవాలు

బంటుమిల్లి: పెశ్చాపురం గ్రామంలో శ్రీ సువర్చలాంజనేయస్వామి వార్షిక పవిత్రోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభమవుతున్నాయి. ప్రతి సంవత్సరం కార్తికమాసంలో నాలుగు రోజులపాటు పండితుల వేద మంత్రాల మధ్య స్వామివారి ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. ఇందులో భాగంగా ఈ నెల 11వ తేదీ నుంచి 14వ తేదీ వరకు ఉత్సవాలు నిర్వహించేందుకు పండితులు, కమిటీ సభ్యులు రూపకల్పన చేశారు. ఈ సందర్భంగా మొదటిరోజు పలువురు దంపతుల దీక్షధారణలతో ఉదయం విష్వక్సేనపూజ, సంపూర్ణ నవగ్రహ యజ్ఞం తదితర కార్యక్రమాలతో పూజ కార్యక్రమాలు మొదలు కానున్నాయి. సాయంత్రం 6 గంటలకు పుణ్యాహవచనము, అంకురారోపణ, వాస్తు పూజలు, హోమాలను పరాశరం రంగానాథాచార్యులు, రొంపిచర్ల హనుమంతాచార్యులు శిష్య బృందం వేద మంత్రాల మధ్య ఘనంగా ప్రారంభంకానున్నాయి. ఈ ఉత్సవాల్లో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కావాలని కమిటీ సభ్యులు ఈ సందర్భంగా కోరారు.

నగరానికి పండుగ శోభ

- నేటి నుంచి పాండురంగస్వామి ఉత్సవాలు
- ఉత్సవాలకు సిద్ధమైన ఆలయం



శ్రీ పాండురంగస్వామి



నగరంలోని కూడలిలో విద్యుద్దీపాలతో అలంకరణ

మచిలీపట్నంటౌన్: కార్తిక శుద్ధ ఏకాదశి మహోత్సవాల నిర్వహణకు కీరపండరీపురంగా ప్రసిద్ధి చెందిన మచిలీపట్నం చిలకలపూడి పాండురంగస్వామి ఆలయం సిద్ధమైంది. ప్రతి ఏడాది కార్తిక మాసంలో పాండురంగ స్వామి ఉత్సవాలను వైభ వంగా నిర్వహిస్తారు. ఈనెల 11వ తేదీ సోమవారం నుంచి వైభవోపేతంగా నిర్వహించేందుకు ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. 15వ తేదీ పౌర్ణమి వరకు ఉత్సవాలు నిర్వహించనున్నారు. కార్తిక పౌర్ణమి రోజు తెల్లవారు జాము నుంచి భక్తులు సముద్రుడి చెంతన పవిత్ర పుణ్య సముద్రస్నానాలు ఆచరించి పాండురంగస్వామిని దర్శించుకోవటం ఆనవాయితీగా వస్తోంది.

చరిత్ర ఇదీ..

విజయనగరం జిల్లా బొబ్బిలి తాలుకా ఉత్తరావెల్లి గ్రామం నుంచి చిలకలపూడికి టేకి నరసింహం వలస వచ్చి స్థిరపడ్డారు. పాండురంగడి భక్తుడైన నరసింహం తరచూ మహారాష్ట్రలోని పండరీపురం వెళ్లి స్వామివారిని దర్శించుకునేవారు. నరసింహం కఠోర ప్రార్థనను మెచ్చి పాండురంగడు సాక్షాత్కరించి చిలకలపూడిలో స్వయంభువుగా వెలిశాడు. ఆ తరువాత టేకి నరసింహం 1929లో స్వామి ఆలయ నిర్మాణాన్ని చేపట్టారు. ఆ తరువాత ఆయన మృతితో నరసింహం, సూరమ్మ దంపతుల నిలువెత్తు విగ్రహాలను గుడిలో స్వామివారి దర్శనానికి వెళ్లే దారిలో ఏర్పాటు చేశారు. ఆలయ నిర్వహణ బాధ్యతలను నేటికీ ఆయన వారసులే చూస్తున్నారు.

నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో..

నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో భక్తులకు ఇబ్బందులు ఎదురుకాకుండా ఉండేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. పాండురంగస్వామి ఆలయ ప్రాంగణంలో ఆంజనేయస్వామి, కోటిలింగాల నిక్షిప్తంతో వెలిసిన శివలింగాన్ని భక్తులు సందర్శిస్తారు. ఆలయ ప్రాంగణంలో ఉన్న పెద్ద రావిచెట్టు చుట్టూ భక్తులు ప్రదక్షిణలు చేసి ముడుపులు కడతారు.

ఉపవాస పూజలు..

కీర పండరీ పుర క్షేత్రంలో శ్రీ శుక్లనామ సంవత్సరం కార్తిక శుద్ధ ఏకాదశి బుధవారం ఇక్కడ విశేష పూజలు నిర్వహిస్తారు. విఠల్ పాండురంగ పేరున ఉపవాస పూజలు చేస్తారు. ఆషాఢ, కార్తిక మాసాల్లో బ్రహ్మోత్సవాలను జరుపుతారు.

విద్యుత్ దీపాల అలంకరణ..

నగరంలోని చిలకలపూడి పాండురంగస్వామి ఆలయం, చిలకలపూడిలోని మదర్‌థెరిస్సా విగ్రహం, చిలకలపూడి సెంటర్‌తో పాటు ప్రధాన రహదారిలోని విగ్రహాల కూడళ్ల వద్ద విద్యుత్ దీపాలతో అలంకారం ఏర్పాటు చేశారు. ఆలయం వద్ద పాండురంగస్వామి ఆకృతిలో ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలు ఆకట్టుకున్నాయి.

ఏర్పాట్లు పూర్తి చేశాం..



శ్రీ పాండురంగస్వామి ఉత్సవాల ఏర్పాట్లు పూర్తి చేశాం. ఆలయంలో స్వామివారిని భక్తులు దర్శించుకునేందుకు, పూజలు చేసేందుకు ఏర్పాట్లు చేశాం. క్యూలైన్లలో త్వరితగతిన స్వామివారి దర్శనం చేసుకునేందుకు చర్యలు తీసుకున్నాం. భక్తులకు సమాచారం ఇచ్చి వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా వలంటీర్లను నియమించాం. 12న శ్రీ రుక్మిణీ పాండురంగ స్వామి వార్ల కల్యాణం, 13న రథోత్సవం నిర్వహించనున్నాం. రోజూ పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయి.

– టేకి నరసింహం, వంశపారంపర్య ఆలయ నిర్వాహకుడు

కార్తికేయుని ఆలయానికి పోటెత్తిన భక్త జనం



మోపిదేవిలో స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

మోపిదేవి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న మోపిదేవి శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం భక్తజనంతో పోటెత్తింది. ఆదివారం తెల్లవారుజాము నుంచే ఆలయ ప్రాంగణం జనకెరటంలా ఉప్పొంగింది. ఆలయంలో ఎటుచూసినా సుబ్రహ్మణ్యాయ నమః నామస్మరణతో హో రెత్తించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు స్వామివారి దర్శనం కోసం క్యూలైనులో భక్తులు నిరీక్షించారు. తెలుగు ఉభయ రాష్ట్రాలతో పాటు సుదూర ప్రాంతాల నుంచి వేలసంఖ్యలో వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. నాగపుట్ట, నాగమల్లి వృక్షం, పొంగలిశాల వద్ద భక్తులు గంటల తరబడి వేచి ఉన్నారు. చల్లపల్లి సీఐ ఈశ్వరావు ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీస్ బందోబస్తు నిర్వహించగా, దేవస్థానం వారు సెక్యూరిటీ గార్డులు, చల్లపల్లి ఎస్టేట్ ఆలయ సిబ్బందితో క్యూలైనులోని భక్తులకు మజ్జిగ, తాగునీరు అందించారు. ఆలయ డీసీ దాసరి శ్రీరామ వరప్రసాదరావు ఆధ్వర్యంలో ఆలయ సూపరింటెండెంట్ బొప్పన సత్యనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అన్నసమారాధన

మోపిదేవివార్పు(మోపిదేవి): మండలంలోని మోపిదేవివార్పు దేవుని చెట్టు బాల సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం వద్ద కార్తికమాసం సందర్భంగా ఆదివారం అన్నసమారాధన నిర్వహించారు. ఆలయ కమటీ ఆధ్వర్యంలో ఉదయం అన్నసమారాధన జరిగింది. చుట్టు పక్కల గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలిరావడంతో ఆప్రాంతమంతా జనకెరటంలా నిండిపోయింది. రైతులు, దాతల సహకారంతో అన్నసమారాధన నిర్వహించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

సెలవురోజుల్లో రెచ్చిపోతున్న ఇసుకాసురులు

కూటమి నేతల ఒత్తిళ్లతో అధికారులు సతమతం



శ్రీకాకుళం కృష్ణానది నుంచి ఇసుక లోడుతో వస్తున్న టిప్పర్లు

శ్రీకాకుళం(ఘంటసాల): సెలవు రోజులు వస్తే చాలు ఇసుకాసురులు రెచ్చిపోతున్నారు. మండలంలోని శ్రీకాకుళం కృష్ణానదిలో శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం తెల్లవారుజాము వరకు టిప్పర్లతో భారీగా ఇసుకను తరలిస్తున్నారు. ఉచిత ఇసుకని కూటమి ప్రభుత్వ ప్రకటన నేపథ్యంలో శ్రీకాకుళంలో రెండు ఇసుక రీచ్‌లకు అనుమతి ఇచ్చారు. కానీ కృష్ణానదిలో నీరు ఉండటం వల్ల ఇసుక తవ్వకాలకు అవకాశం లేకపోవడంతో అధికారికంగా ప్రారంభం కాలేదు. అయితే లంక భూముల్లో, ఇతర ప్రాంతాల్లో అక్రమ ఇసుక దారులు కూటమి నేతల అండదండలతో సెలవు రోజుల్లో, అర్ధరాత్రులు ట్రాక్టర్లతో ఇసుకను తరలించడం అధికారులు అడ్డుకోవడం, జరిమానా విధించడం జరుగుతోంది. ప్రస్తుతం టిప్పర్లలో ఇసుకను తరలించడంతో స్థానికులు ట్రాక్టర్లు పోయి టిప్పర్లు వచ్చే అంటూ చర్చించుకుంటున్నారు.

బాట పేరుతో భారీ దోపిడీ..

శ్రీకాకుళంలో ఇసుక రీచ్‌లకు బాట పేరుతో కూటమి నేతలు టిప్పర్లతో భారీగా ఇసుక తరలిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. బాట వేసేందుకు మెటీరియల్ పేరుతో లోపలికి వెళ్తున్న టిప్పర్లు ఇసుకతో బయటకు వస్తున్నాయి. శ్రీకాకుళంలో ఇసుక తరలిస్తున్నారన్న సమాచారం అందుకున్న రెవెన్యూ అధికారులు సంఘటనా స్థలానికి వెళ్లగా బాట వేస్తున్నామని చెప్పడం కొసమెరుపు.

భక్తిశ్రద్ధలతో కార్తిక వన సమారాధన



గౌడ కులస్తుల కార్తిక సమారాధనలో మంత్రి కొల్లు రవీంద్ర, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల తదితరులు

మచిలీపట్నంటౌన్: నగరంలో పలు సంఘాల ఆధ్వర్యంలో కార్తిక వన సమారాధనలు ఆదివారం ఆనందోత్సాహాల నడుమ, అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పెద్దలు కార్తిక మాసం సందర్భంగా సామూహిక సత్యన్నారాయణ వ్రతాలు నిర్వహించగా, చిన్నారులు ఆటపాటలు, లక్కీ డిప్‌లతో సందడిగా గడిపారు. స్థానిక చిట్టిపాలెం రోడ్‌లోని సత్య కన్వెన్షన్ హాల్ వద్ద కృష్ణా జిల్లా ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ ఆధ్వర్యంలో కార్తిక వన సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. చిన్నారులు ఆట పాటలతో సరదాగా గడిపారు. నగరంలోని వ్యాపారులు కుటుంబ సమేతంగా వేలాదిగా తరలివచ్చి కార్తిక భోజనాలు చేశారు. రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర, ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు హాజరయ్యారు. వీరిని నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. నగరంలో చిన్నగా వ్యాపారాలు ప్రారంభించి నేడు పెద్ద సంస్థలను నడుపుతున్న పారిశ్రామిక వేత్తలు చలమలశెట్టి నరశింహారావు, బండి రామకృష్ణ వ్యాపారంలో వారు ఎలా విజయాలు సాధించారో వివరించారు. లక్కీ డిప్ విజేతలకు మంత్రి రవీంద్ర, ఆర్టీసీ చైర్మన్ నారాయణరావు బహుమతులను అందజేశారు. సంఘ అధ్యక్షుడు మద్దుల గిరీష్‌కుమార్, ప్రధాన కార్యదర్శి పల్లపోతు సుబ్రహ్మణ్యేశ్వరరావు, కోశాధికారి సాధు మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు. మచిలీపట్నం కెమిస్టు అండ్ డ్రగిస్టు అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక గోసంఘంలో కార్తిక వన సమారాధన నిర్వహించారు. పలువురు దంపతులు సామూహిక సత్యన్నారాయణస్వామి వ్రత పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ పూజా కార్యక్రమాన్ని ముత్తేవి శ్రీనివాస్‌శి పర్యవేక్షణలో జరిపారు. నగరంలోని మందుల దుకాణాల యజమానులు కుటుంబ సమేతంగా ఉత్సాహంగా హాజరయ్యారు. కార్యక్రమాన్ని సంఘ అధ్యక్షుడు ఉదయగిరి సురేష్, కార్యదర్శి మాదిరెడ్డి అంజిబాబు, కోశాధికారి కె.అశోక్‌కుమార్ పర్యవేక్షించారు. గౌడ, శెట్టిబలిజ, ఈడిగ, శ్రీశయన, యాత సంఘీయుల ఆధ్వర్యంలో కూడా కార్తిక వన సమారాధన కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర, ఆర్టీసీ చైర్మన్ కినకళ్ల నారాయణరావు, బీసీ నాయకుడు కొనకళ్ల బుల్లయ్య, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి గురుమూర్తి, జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కుక్కల వీర వెంకట సత్యన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

దాళ్వాపై వీడని సందిగ్ధం

కృత్తివెన్ను: రెండో పంట దాళ్వాకు రైతాంగానికి ప్రభుత్వం నుంచి స్పష్టమైన ప్రకటన రాకపోవడం తీవ్ర గందరగోళానికి గురిచేస్తోంది. ఈ ప్రాంతం సముద్రానికి అత్యంత చేరువగా ఉండటంతో వరికి ప్రత్యామ్నాయంగా ఇతర పంటలకు ఆస్కారం లేదు. గడిచిన ఐదేళ్ల నుంచి ప్రతి ఏడాది వరిసాగు విస్తీర్ణం తగ్గుతూ వస్తోంది. 2019లో ఏడు వేల ఎకరాలలో వరిని సాగుచేస్తే ప్రస్తుతం 5,200 ఎకరాలకు పడిపోయింది. ఖరీఫ్ సాగులో రైతుకు ఏ మాత్రం మిగులు ఉండదు. రబీ ఉంటేనే ఈ ప్రాంతంలో రైతులకు గిట్టుబాటు అవుతుంది. దీని దృష్ట్యా ఎన్నోసార్లు రెండో పంట అయిన దాళ్వా కోసం రైతులు పోరాడుతూనే ఉన్నా ఫలితం లేకుండా పోతోంది. ఈ ఏడాది కూడా దాళ్వాపై సందిగ్ధం కొనసాగడంతో రైతుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. దాళ్వా లేకపోతే అపరాల సాగులో భాగంగా మినుములు వేసుకోవాల్సి ఉంటుంది. ప్రభుత్వ యంత్రాంగం, ప్రజాప్రతినిధులు దాళ్వాపై ప్రకటన చేయకుండా, సబ్సిడీపై మినుము విత్తనాలు అందించకుండా తాత్సారం చేయడం ఎంతవరకు సమంజసమని రైతులు ప్రశ్నిస్తున్నారు. దీనిపై ప్రభుత్వం స్పందించాలని కోరుతున్నారు.

రోడ్డు పక్కన వ్యర్థాల తొలగింపు



వ్యర్థాల తొలగింపును పరిశీలిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

కోడూరు: కోడూరు– అవనిగడ్డ ప్రధాన రహదారి పక్కన పెట్రోల్ బంక్ సమీపంలో, నరసింహపురం రహదారిలోని సాయిబాబా మందిర సమీపంలో డంపింగ్ చేసిన వ్యర్థాలను పంచాయతీ అధికారులు ఆదివారం తొలగించారు. జేసీబీ సహాయంతో వ్యర్థాలను తొలగించి, పారిశుద్ధ్య పనులు చేపట్టారు. కూరగాయలు, బార్బర్ షాపు, భోజన హోటల్ యజమానులు వ్యర్థాలను పంచాయతీ ఏర్పాటు చేసిన చెత్తబుట్టల దగ్గర కాకుండా రహదారి పక్కనే వేస్తున్నారని కార్యదర్శి శేషగిరిరావు చెప్పారు. గృహాలను కూల్చినవారు, సెప్టిక్ ట్యాంక్ వ్యర్థాలను కూడా ఈ ప్రాంతాల్లో డంపింగ్ చేస్తున్నారని తెలిపారు. వ్యాపారులు రహదారుల పక్కన వ్యర్థాలను డంపింగ్ చేస్తే కఠిన చర్యలు తప్పవని శేషగిరిరావు హెచ్చరించారు. ఎంపీటీసీలు బడే గంగాధరరావు, తిమ్మన నాంచారయ్య, వైఎస్సార్ సీపీ ఎస్సీసెల్ కన్వీనర్ వెన్నా ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి సంఘాల ఓటర్ల జాబితా ప్రదర్శన



ముసాయిదా జాబితా విడుదల చేస్తున్న తహసీల్దారు అనిల్‌కుమార్ తదితరులు

పెడన: సాగునీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి రెవెన్యూ శాఖా పరంగా ఓటర్లు జాబితా ముసాయిదాను ఆదివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి తహసీల్దారు కె.అనిల్‌కుమార్ మాట్లాడుతూ పెడన మండల వ్యాప్తంగా సాగునీటి సంఘాల ఎన్నికలకు నోటిఫై అయిన ఓటర్లు సుమారు 10,226 మంది ఉన్నారని తెలిపారు. ఓటర్ల జాబితాలను తహసీల్దారు కార్యాలయంలోనే కాకుండా మండలంలోని అన్ని పంచాయతీ కార్యాలయాల్లోనూ నోటీసు బోర్డుల్లో పెట్టామన్నారు. ఇరిగేషన్ శాఖవారు ఇచ్చిన సర్వే నంబర్ల ఆధారంగా ఓటర్ల జాబితాలను రూపొందించామని, ముసాయిదా జాబితాలలో అభ్యంతరాలుంటే తెలియజేయాలన్నారు. 11, 12వ తేదీలలో అభ్యంతరాలను స్వీకరిస్తామని, 13న పరిష్కారించి ఆ రోజు సాయంత్రం ఓటర్ల జాబితా విడుదల చేస్తామన్నారు. ఆ జాబితాలో కూడా సమస్య పరిష్కారం కాకపోతే 14, 15వ తేదీలలో మచిలీపట్నం ఆర్డీవోకు అప్పీల్ చేసుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఆర్ఐ విజయలక్ష్మి, వీఆర్వోలు మధు, ప్రసాద్ తదితరులున్నారు.

అభ్యంతరాలు ఉంటే తెలపాలి



కొడాలి పీఏసీఎస్‌లో ఓటర్ల లిస్టు ప్రదర్శిస్తున్న వీఆర్వో శ్రీనివాస్, సెక్రటరీ ఆదినారాయణ

కొడాలి(ఘంటసాల): సాగునీటి సంఘాల ఓటర్ల జాబితాలో అభ్యంతరాలు ఉంటే సకాలంలో తెలపాలని తహసీల్దార్ బి.విజయ ప్రసాద్ అన్నారు. మండలంలోని సాగునీటి సంఘాల ఓటర్ల జాబితాను ప్రదర్శించారు. ఆయా ఓటర్ల జాబితాలో అర్హులైన రైతుల పేర్లు ఉన్నాయో లేదో చూసుకుని, అభ్యంతరాలు ఉంటే 13వ తేదీ లోపు వీఆర్వోలకు, తన కార్యాలయంలో తెలియజేయాలని తహసీల్దార్ విజయ ప్రసాద్ కోరారు. శ్రీకాకుళం, తెలుగురావుపాలెం, కొత్తపల్లి పంచాయతీ, పీఏసీఏస్ కార్యాలయాల్లో ఓటర్ల జాబితా ప్రదర్శించారు. డీటీ కనకదుర్గ, ఆర్ఐ కె.శ్రీనివాస్, సీనియర్ అసిస్టెంట్ చైతన్య లక్ష్మి, వీఆర్వోలు డి.గోపి, పి.వెంకటేశ్వరరావు, కె.వెంకటేశ్వరరావు, ఈవోలు సునంద, అశ్విన్ కుమార్, కార్యదర్శులు ఆదినారాయణ, వేణుగోపాల్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సాగరతీరంలో పర్యాటకుల సందడి



తీరంలో పర్యాటకులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

కోడూరు: కార్తికమాసం, వరుస సెలవుల కారణంగా హంసలదీవి సాగరతీరం పర్యాటకులతో కళకళలాడింది. ఆదివారం సుదూర ప్రాంతాలకు చెందిన యాత్రికులు సాగరతీరంలో సరదాగా గడిపేందుకు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. సూర్యోదయ సమయానికే పర్యాటకులు సముద్రస్నానం ఆచరించేందుకు తరలిరావడంతో తీరంలో పండుగ వాతావరణం కనిపించింది. సాయంత్రం వరకు భక్తులు కార్తికస్నానాలు ఆచరించేందుకు తరలివస్తునే ఉన్నారు. మహిళలు తీరం వెంట సైకత శివలింగాలను తయారు చేసి వాటి చుట్టూ కార్తిక దీపాలను వెలిగించి తమ భక్తిభావం చాటుకున్నారు. విజయవాడ, గుంటూరుకు చెందిన పలు విద్యాసంస్థలు తమ పాఠశాల చిన్నారులను బీచ్ వద్దకు తీసుకువచ్చారు. బెంగుళూరు, విశాఖపట్నం, హైదరాబాద్ నుంచి పర్యాటకులు టూరిస్ట్ బస్సుల్లో వచ్చి సందడి చేశారు. పాలకాయతిప్ప మెరైన్ సీఐ సురేష్‌రెడ్డి పర్యవేక్షణ సిబ్బంది తీరం వెంట గస్తీ నిర్వహించారు.

కాలువలో పడి మహిళ మృతి



కుటుంబసభ్యులకు నగదును అందిస్తున్న గ్రామస్తులు

కోడూరు: దుస్తులు ఉతికేందుకు కాలువ వద్దకు వెళ్లిన మహిళ ఫిట్స్ రావడంతో నీటిలో పడి మృతిచెందిన ఘటన కోడూరులో ఆదివారం చోటు చేసుకుంది. కో డూరు గ్రామానికి చెందిన రమణ (53) రజక వృత్తిలో భాగంగా కాలువలో దుస్తులు ఉతికేందుకు స్థానిక పశువుల ఆసుపత్రి సమీపంలోని 11వ నంబర్ పంటకాలువ వద్దకు వచ్చింది. దుస్తులు ఉతుకుతుండగా ఫిట్స్ రావడంతో రమణ పంట కాలువలోకి పడిపోయింది. అటుగా వెళ్తున్న స్థానికులు కాలువ నీటిలో మహిళ పడి ఉండటాన్ని గమనించి ఒడ్డుకు చేర్చారు. నీరు తాగేయడంతో రమణ అప్పటికే మృతి చెందింది. మృతురాలికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

రూ.11,500 సాయం..

రమణ కుటుంబ సభ్యులకు గ్రామస్తులు ఆర్థిక సహాయం అందించారు. వీరిది నీరుపేద కుటుంబం కావటంతో మట్టి ఖర్చుల నిమిత్తం గ్రామస్తులు రూ.11,500 నగదును కుటుంబ సభ్యులకు అందించి మానవత్వం చాటారు. మాజీ ఎంపీటీసీ బడే వీరబాబు, పంచాయతీ కార్యదర్శి బడే శేషగిరిరావు, మారుబోయిన ప్రసాద్, కొండవీటి రామకృష్ణ అరజా ఉమామహేశ్వరరావు, ఇంకొల్లు ఆశోక్‌మహారాజ్, బొర్రా వెంకటేశ్వరరావులు సహాయం అందించినవారిలో ఉన్నారు.

13న వైఎస్సార్ సీపీ కార్యకర్తల సమావేశం

అవనిగడ్డ: స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద ఈనెల 13న నియోజకవర్గస్థాయిలో పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నట్లు పార్టీ కార్యాలయ సిబ్బంది తెలిపారు. నియోజకవర్గ సమన్వయకర్త సింహాద్రి రమేష్‌బాబు ఆధ్వర్యంలో మధ్యాహ్నం 3 గంటలకు జరిగే ఈ సమావేశానికి నియోజకవర్గంలోని పార్టీ బాధ్యులు అందరూ హాజరు కావలసినదిగా కోరారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

కోనేరుసెంటర్: బైక్‌లు ఢీకొని ఓ యువకుడు మృతి చెందాడు. మచిలీపట్నంలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్ఐ బి.ప్రభాకరరావు తెలిపిన వివరాలు. పెడన మండలం కొంకేపూడి గ్రామానికి చెందిన శలపాటి అశోక్‌కుమార్ (22) ఇంటర్మీడియెట్ వరకు చదువుకున్నాడు. తల్లి చనిపోవటంతో విజయవాడలో ఉంటూ ఏసీ మెకానిజం నేర్చుకుంటున్నాడు. నాలుగు రోజుల క్రితం గ్రామానికి వచ్చిన అశోక్‌కుమార్ బందరు వైఎస్సార్‌కాలనీలో తండ్రిని చూసేందుకు బైక్‌పై మచిలీపట్నం వచ్చాడు. దిమ్మెల సెంటర్ నుంచి నోబుల్ కళాశాల వైపు వెళుతుండగా ఎదురుగా మరో వాహనదారుడు ఢీ కొన్నాడు. మచిలీపట్నం సర్వజన ఆసుపత్రిలో అశోక్‌కుమార్ మృతి చెందగా మరో వాహనదారుడు చికిత్స పొందుతున్నాడు.

చురుకుగా నీటి సంఘాల ఎన్నికల ఏర్పాట్లు

11, 12 తేదీలలో అభ్యంతరాల స్వీకరణ

నాగాయలంక: మండల పరిధిలోని 12 నీటి సంఘాలకు ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నామని స్థానిక తహసీల్దార్ ఎం.హరనాథ్ ఆదివారం చెప్పారు. ఓటర్ల జాబితా ముసాయిదాను విడుదల చేశారు. మడలంలో 12 నీటి సంఘాల పరిధిలో 108 టీసీలు ఉన్నాయన్నారు. రైతు ఓటర్ల జాబితాలో అభ్యంతరాలను 11,12 తేదీలలో తహసీల్దార్‌కు అందించాలని సూచించారు. 13న అభ్యంతరాలు పరిష్కారం ఉంటుందని, వీటిపై అభ్యంతరాలు ఉంటే 14,15 తేదీలలో ఆర్డీఓకు అప్పీలు, 16, 17 తేదీలలో పరిష్కారం ఉంటుంది. కాగా 20న నీటి సంఘాల ఎన్నికకు నోటిఫికేషన్ జారీ అవుతుందని, 21న ఉదయం గం.8 నుంచి గం.12 వరకు టి.సిలకు మధ్యాహ్నం 2గం.నుంచి నీటి సంఘాలకు (డబ్ల్యూయూఏ)ఎన్నికలు జరుగుతాయి. 24న డిస్ట్రిబ్యూటరి కమిటీ(డి.సి) ఎన్నిక నిర్వహిస్తారు.

రెండో రోజుకు చేరిన రైతుల దీక్ష



రైతు దీక్షకు మద్దతుగా పాల్గొన్న ఎంపీపీ తదితరులు

బంటుమిల్లి: దాళ్వా పంట కోసం సాగునీరు విడుదల చేయాలని కోరుతూ రైతులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారం రెండో రోజుకు చేరాయి. బంటుమిల్లి ప్రధాన కాలువ పరిధిలో రెండో పంట దాళ్వాకు సాగునీరు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ రైతు సంఘం ఆధ్వర్యంలో దీక్షలు చేపట్టారు. ఈ దీక్షకు మద్దుతు తెలిపిన ఎంపీపీ వి.చినబాబు మాట్లాడుతూ ఎన్నికల ముందు రెండో పంటకు సాగునీరిస్తామని స్థానిక ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ హామీ ఇచ్చి, నేడు నీరు ఇవ్వకుండా రైతులను రోడ్డు ఎక్కించారని విమర్శించారు. గత నాలుగు సంవత్సరాలుగా దాళ్వాకు నీరు లేక భూములు చౌడు బారిన పడుతున్నాయన్నారు. ప్రస్తుతం నీరు ఉన్నప్పటికీ ప్రభుత్వం నీరివ్వకుండా రైతులను ఇబ్బందులు పెడుతోందని రైతు సంఘ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దీక్షలకు మద్దతు తెలిపిన వారిలో వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు ఎస్.మహేష్, నాయకుడు ఎం.నాగేశ్వరరావు, నాయకులు బి.హరిరామ్, ఎస్.నవీన్‌కృష్ణ, కె.వెంకటేశ్వరరావు, ఎస్. సతీష్, పలు గ్రామాల నాయకులు పాల్గొన్నారు.